క్లుప్తంగా

వరద ముంపు గ్రామాల్లో మంత్రి పర్యటన



గన్నవరం రూరల్: మండలంలోని జక్కులనెక్కలం, సావరగూడెం, ముస్తాబాద గ్రామాల్లోని వరద ప్రాంతాల్లో రాష్ట్ర గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి పర్యటించారు. గ్రామస్తులతో మాట్లాడి ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ముంపు ప్రాంతాల్లో ఆహారం, తాగునీటి పంపిణీ వివరాలు బాధితులను అడిగి తెలుసుకున్నారు. బుడమేరుకు పడిన గండ్లను పూడ్చే బాధ్యతతో ప్రభుత్వం పని చేస్తుందని వివరించారు. 40ఏళ్లలో ఎప్పుడూ చూడని విధంగా విపత్తు వచ్చిందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పంట పొలాల పరిశీలన



కేసరపల్లి(గన్నవరం): మండలంలోని కేసరపల్లిలో వరద ముంపునకు గురైన పంట పొలాలను గురువారం జిల్లా కలెక్టర్ డీకే. బాలాజీ పరిశీలించారు. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ పర్యటన ఏర్పాట్ల నిమిత్తం కలెక్టర్‌తోపాటు ఎస్పీ ఆర్.గంగాధర రావు గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా వరద ముంపులో ఉన్న వరిపైరులను కలెక్టర్‌కు చూపించి ఆదుకోవాలని రైతులు కోరారు. మాజీ ఏఎంసీ చైర్మన్ పొట్లూరి బసవరావు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

కంకిపాడు: వరదలు, వర్షాలతో దెబ్బతిన్న పంట పొలాలను ఉద్యానశాఖ అధికారులు గురువారం పరిశీలించారు. ఉద్యానశాఖ కంకిపాడు ఇన్‌చార్జి అధికారి ఎ. నాగదేవిశ్రీ, ఉద్యాన సహాయకులు, రైతులతో కలిసి దావులూరు, మద్దూరు పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో ముంపు బారినపడి దెబ్బతిన్న అరటి, పసుపు, కంద, కూరగాయ తోటలను పరిశీలించారు. నాగదేవిశ్రీ మాట్లాడుతూ తోటల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, చిన్న కాలువల ద్వారా నీటిని తీసివేయాలన్నారు. వేరుకుళ్లు వ్యాప్తి చెందకుండా కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లీటరు నీటికి కలిపి మొక్క మొదళ్లలో పోసుకోవాలన్నారు. మొక్కలు బలంగా ఎదగడానికి 13-0-45 లేదా 3 గ్రాములు యూరియా ద్రావణాన్ని 2-3 పర్యాయాలు వారం రోజుల వ్యవధిలో పిచికారీ చేసుకోవాలన్నారు. పసుపు తోటల్లో ఇనుపధాతులోపం ఏర్పడి లేత ఆకులు పాలిపోయినట్లు కనిపిస్తే 10 లీటర్ల నీటిలో 50 గ్రాములు అన్నబేది ఒక నిమ్మ చెక్క రసం, జిగురు మందుతో కలిపి 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయడం ద్వారా ప్రయోజనం ఉంటుందని వివరించారు. పర్యటనలో పలువురు రైతులు పాల్గొన్నారు.

12న ఆలయ హుండీ కానుకల లెక్కింపు

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీకనకదుర్గ అమ్మవారి దేవస్థానం హుండీ కానుకలను ఈనెల 12వ తేదీ లెక్కించనున్నట్లు ఆలయ ఈఓ యువి. ప్రసాదరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అమ్మవారికి సమర్పించిన కానుకలు ఉదయం 10 గంటలకు ఆలయ ప్రాంగణంలో దేవదాయ, ధర్మదాయ శాఖ అధికారుల సమక్షంలో లెక్కిస్తామని చెప్పారు. హిందూ సేవాదళ్ సభ్యులు, గ్రామ పెద్దలు హుండీ లెక్కింపులో పాల్గొంటారని తెలిపారు.



మద్దూరులో ఇంకా పొలాల్లో నుంచి కదలని వరద నీరు



యనమలకుదురులో పూర్తిగా దెబ్బతిన్న కూరగాయల పంటలు



కాసరనేనివారిపాలెంలో ముంపు నుంచి బయటపడ్డ శివాలయం

కొనసాగుతున్న బుడమేరు ఉధృతి

- వరద నీటిలోనే పొలాలు, గ్రామాలు
- పలు గ్రామాలకు రాకపోకలు బంద్

కంకిపాడు: బుడమేరు ఉగ్రరూపం కొనసాగుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి బుడమేరుకు వరద నీరు భారీగా వచ్చి చేరుతోంది. మండల పరిధిలోని ఉప్పలూరు, తెన్నేరు, మంతెన గ్రామాల వాసులు ముంపు భయంతో వణికిపోతున్నారు. కంకిపాడు-గన్నవరం రహదారి మార్గంపైకి ఉప్పలూరు వద్ద వంతెన మీదుగా బుడమేరు ప్రవహిస్తుండటంతో ఈ మార్గంలో అధికారులు రాకపోకలు నిలిపేశారు. ఇప్పటికే ఉప్పలూరు, మంతెన, తెన్నేరు పరిధిలోని వందలాది ఎకరాల పంట పొలాలు నీట మునిగి చెరువులను తలపిస్తున్నాయి. బుడమేరు ప్రభావం అధికంగా ఉన్న మంతెన, తెన్నేరు, ఉప్పలూరు గ్రామాల్లో 1,170 మంది నిర్వాసితులను ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించారు. తహసీల్దార్ వి. భావన్నారాయణ పర్యవేక్షణలో నిర్వాసితులకు వసతులు కల్పించారు.

ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పర్యటన

తెన్నేరు గ్రామంలోని బుడమేరు ముంపు ప్రాంతాల్లో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ గురువారం పర్యటించారు. నీట మునిగిన ఇళ్లు, పొలాలను సందర్శించి బాధితులతో మాట్లాడారు. పునరావాస కేంద్రాలకు వెళ్లి వసతులపై సమీక్షించారు. పర్యటనలో పలువురు అధికారులు పాల్గొన్నారు.



తెన్నేరు ప్రధాన గ్రామంలోకి చొచ్చుకువచ్చిన బుడమేరు

గన్నవరం రూరల్: మండలంలోని చిక్కవరం బ్రహ్మయ్యలింగం చెరువు కళింగ పొంగి పొర్లుతోంది. ఎగువ ప్రాంతంలోని కుంపిణీ వాగు ప్రవాహం ఈ చెరువులోకి వచ్చి చేరుతుండటంతో కళింగలు పొంగాయి. దీంతో ఈ కళింగ నీరు చీమల వాగులోకి ప్రవహించి కొత్తగూడెం, చిక్కవరం, బీబీ గూడెం గ్రామాల మీదుగా ఉధృతంగా ప్రవహిస్తోంది. గ్రామాల్లోకి నీరు రావడంతో ఆయా గ్రామాల ప్రజలు ఆందోళనకు గురి అవుతున్నారు. గురువారం తెల్లవారుజామున కురిసిన వర్షంతో పాటు, ఎగువ ప్రాంతం నీరు వస్తుండటంతో నీరు గ్రామాల్లోకి వస్తోంది.

గన్నవరం: విజయవాడరూరల్, గన్నవరం మండలాల పరిధిలో గురువారం తెల్లవారుజాము నుంచి కురిసిన భారీ వర్షాలకు బుడమేరు కాలువలో వరద నీటి ప్రవాహం మరింత పెరిగింది. దీంతో కేసరపల్లి-ఉప్పలూరు గ్రామాల మధ్య ఉన్న బుడమేరు వంతెనపై సుమారు ఐదు అడుగుల ఎత్తులో నీరు ప్రవహిస్తోంది. కేసరపల్లి-సావరగూడెం రోడ్డులో కూడా చీమలవాగు ప్రవాహం పెరిగింది. దీంతో ఆయా మార్గాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. బుద్ధవరం-దావాజిగూడెం గ్రామాల మధ్య ఏలూరు కాలువకు గండి పడింది. గండికి అడ్డుకట్ట వేసేందుకు గ్రామస్తులు ప్రయత్నాలు చేస్తున్నారు.

ఉంగుటూరు: మండలంలో బుడమేరు, వన్నేరు వాగుల ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఐదు రోజులుగా పలు గ్రామాలు ఇంకా జలదిగ్బంధంలోనే ఉన్నాయి. వెల్దిపాడు, కొయ్యగూరపాడు గ్రామాలకు ఉన్న రహదారులపై వరద ప్రవహించడంతో ప్రజలు గ్రామంలో నుంచి బయటకు రాలేక ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు జేసీబీ, ట్రాక్టర్లపైన ఆ గ్రామాలకు వెళ్లి పర్యవేక్షిస్తున్నారు. తేలప్రోలు-నందమూరు, గన్నవరం-పుట్టగుంట ప్రధాన రహదారుల్లో రోడ్డు పైనుంచి వరద ప్రవాహం కొనసాగడంతో రాకపోకలు స్తంభించాయి.



తెన్నేరులో నీట మునిగిన వరి పొలాలు



చిక్కవరం గ్రామంలో ఇళ్లల్లోకి వచ్చిన చీమలవాగు నీరు



కేసరపల్లి-సావరగూడెం మధ్య చీమలవాగు వరదనీటి ప్రవాహం



ఉంగుటూరు రహదారిపై బుడమేరు



కేసరపల్లి-ఉప్పలూరు మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న బుడమేరు

వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శిగా అన్నే



పెనమలూరు: వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శిగా అన్నే వేణుగోపాల కృష్ణమూర్తి (చిట్టిబాబు)ను నియమిస్తూ వైఎస్సార్ సీపీ రాష్ట్ర కేంద్ర కార్యాలయం గురువారం ప్రకటించింది. పార్టీ అధ్యక్షుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అన్నే వేణుగోపాల కృష్ణమూర్తి నియామకం జరిగింది. ఆయన వైఎస్సార్ సీపీలో చాలా కాలంగా సేవలు అందిస్తున్నారు. గతంలో కానూరు సర్పంచిగా పని చేశారు. ఆయన భార్య అన్నే సుజాత కూడా కానూరు సర్పంచిగా సేవలు అందించారు. ఆయన కుమారుడు అన్నే శ్రావణ్‌కుమార్ తాడిగడప మున్సిపాలిటీ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడిగా ఉన్నారు. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని అన్నే చిట్టిబాబు తెలిపారు.

చవితి ఉత్సవాలు జాగ్రత్తగా నిర్వహించాలి

పెనమలూరు: వినాయక చవితి ఉత్సవాలు జాగ్రత్తగా నిర్వహించాలని ఎస్ఐ సత్యసుధాకర్ సూచించారు. కానూరులోని కల్యాణ మండపంలో గురువారం చవితి ఉత్సవాలు నిర్వహించే కమిటీలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆన్‌లైన్‌లో ఇప్పటివరకు వినాయక విగ్రహాలను ఏర్పాటు చేయడానికి 143 దరఖాస్తులు అందాయన్నారు. ఉత్సవాలు చట్ట ప్రకారం నిర్వహించే బాధ్యత ఆయా కమిటీలదే అన్నారు. వినాయకుడి పందిళ్లు రోడ్లపై ఏర్పాటు చేయరాదని, విద్యుత్, ఫైర్ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. నిమజ్జన సమయంలో డీజేలు, టపాసులు కాల్చరాదని, మద్యం సేవించి డ్యాన్సులు చేయరాదన్నారు. అవాంఛనీయ ఘటనలు జరిగితే కమిటీలే బాధ్యత వహించాలని తెలిపారు. సమావేశంలో ఎస్ఐ రమేష్, ఉత్సవ కమిటీలు పాల్గొన్నారు.

ఇదెక్కడి చోద్యం?



ఏనుగులకోడుపై వంతెన ఎగువున కొట్టిన గండి

కంకిపాడు: పంట పొలాల ముంపు సమస్యను పరిష్కరించేందుకు అధికారులు తీసుకుంటున్న చర్యలు విస్మయం కలిగించేలా ఉంటున్నాయి. తోట్లవల్లూరు, కంకిపాడు మండలాల గుండా ఏనుగుల కోడు ప్రవహిస్తుంది. రొయ్యూరు-గొడవర్రు గ్రామాల నడుమ రాకపోకలకు వీలుగా ఏనుగుల కోడుపై వంతెన ఉంది. కోడుకు భారీగా వచ్చిన వరద కారణంగా గొడవర్రు పరిధిలో పంట పొలాలు నీట మునిగాయి. దీంతో అధికారులు వంతెన ఎగువున కట్టపై గండికొట్టి పొలాల్లో ఉన్న మురుగును కోడులోకి మళ్లిస్తున్నారు. అయితే వంతెనకు దిగువున కట్ట మీదుగా నీరు పొంగిపొర్లి పక్కనే ఉన్న పంట పొలాల్లోకి ప్రవహిస్తోంది. ముంపు సమస్య నివారణకు చర్యలు తీసుకోకుండా ఇదెక్కడి చోద్యం అంటూ రైతులు పెదవి విరుస్తున్నారు.

నిర్వాసితులకు ఆహారం పంపిణీ

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో జిల్లా పరిషత్ హైస్కూల్‌లోని పునరావాస కేంద్రంలో ఉంటున్న వరద బాధితులకు గురువారం భోజనాలు పంపిణీ చేశారు. అంబాపురం గ్రామానికి చెందిన సుమారు రెండు వందల మంది పునరావాస కేంద్రంలో ఉంటున్నారు. జిల్లా పంచాయతీ అధికారి డి.శివప్రసాద్ ప్రత్యేక అధికారిగా బాధితులకు సహాయ చర్యలు నిర్వహిస్తున్నారు. కొందరు సరైన సదుపాయాలు లేవని అక్కడ నుంచి ఇంటికి వెళ్లిపోతున్నారు.

గన్నవరం రూరల్: మండలంలోని బీబీగూడెం ఉప సర్పంచ్ కాట్రు ధర్మారావు ఆధ్వర్యంలో మాదిగ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ గ్రూప్ తరఫున వరద బాధితులకు గురువారం 300 ఆహార ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఉంగుటూరు మండలం వెల్దిపాడు గ్రామంలో బాధితులకు అందజేశారు. ఎమ్మార్పీఎస్ నాయకులు బొకినాల కిరణ్, ఇందుపల్లి మురళీ, సాయిల ధమయంతమ్మ, ప్రభావతి, కాండ్రు మోహనరావు, వంశీ విశిష్ట పాల్గొన్నారు.

విజయవాడరూరల్: నున్న, పాతపాడు గ్రామస్తులు గత మూడు రోజులుగా వరద బాధితులకు ఆహారం అందిస్తున్నారు. గురువారం నున్న వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యుడు ప్రత్తిపాటి రవీంద్ర, ప్రత్తిపాటి సుందరయ్య, ఎస్సీ కాలనీవాసుల సాయంతో మూడు ట్రాక్టర్లతో పులిహోర, ఎగ్‌బిర్యాని, వైట్‌రైస్‌ను వరద బాధితులకు అందజేశారు. పాతపాడు గ్రామంలో కలపాల అబ్రహాం ఆధ్వర్యాన ఎస్సీ కాలనీవాసులు భోజనాలు, తాగునీరు అందజేయడం జరిగింది. నున్న, పాతపాడు, విలేజి కండ్రిక గ్రామాల్లో అనేక వర్గాల నుంచి దాతలు సహృదయంతో బాధితులకు ఆపన్నహస్తం అందిస్తున్నారు. వైఎస్సార్ సీపీకి చెందిన దేవగిరి ఓంకార్‌రెడ్డి, కలకోటి బ్రహ్మానందరెడ్డి, యర్కారెడ్డి బుజ్జి, భీమవరపు నరేంద్ర, శివారెడ్డి, రామారావు, అంగజాల హనుమా, జీతం శ్రీనివాసరావు, వికాస్ కాలేజీ యాజమాన్యం ఇంకా పలువురు రాజకీయ పార్టీల ప్రమేయం లేకుండా బాధితులను ఆదుకుంటున్నారు.



నున్న సీఎస్ఐ చర్చి నుంచి అన్న, పానీయాలతో వెళ్తున్న ట్రాక్టర్లు



బాధితులకు ఆహారం అందజేస్తున్న ఓంకార్‌రెడ్డి

బాధితులకు విద్యార్థుల చేయూత

పెనమలూరు: వరద బాధితులకు విద్యార్థులు ముందుకు వచ్చి తమవంతు సాయం అందించారు. కానూరు షామ్రాక్ ఇంటర్నేషనల్ పాఠశాల విద్యార్థులు సీఎం సహాయ నిధికి రూ. 3 లక్షల చెక్కును జిల్లా కలెక్టర్ డీకే.బాలాజీకి గురువారం అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సుమన్‌త్యాగరాజ్, ప్రెసిడెంట్ మౌనికా సుమన్, ప్రిన్సిపాల్ భారతీధర్, స్కూల్ హెడ్ బాయ్ దర్శ్, హెడ్‌గర్ల్ ఇంద్రియాసుధ, అర్జున్, గుర్మన్ పాల్గొన్నారు.

భవిష్య కాలేజీ చేయూత..

కానూరు భవిష్య జూనియర్ కాలేజీ యాజమాన్య, సిబ్బంది వరద బాధితులకు తమవంతు సాయంగా రూ. 3లక్షల చెక్కు సీఎం సహాయనిధికి అందచేశారు. ఈమేరకు పోరంకి టీడీపీ కార్యాయలంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు నగదు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో అనుమోలు ప్రభాకరరావు, కాలేజీ యాజమాన్యం పాల్గొన్నారు.



కలెక్టర్ బాలాజీకి రూ. 3లక్షల చెక్కు అందజేస్తున్న షామ్రాక్ విద్యార్థులు

ఇద్దరు ఉపాధ్యాయులకు అవార్డులు

పెనమలూరు: పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ దినోత్సవం(గురుపూజా మహోత్సవం) సందర్భంగా జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు వరించాయి. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న జవ్వాది వెంకటేశ్వరరావు, సాంఘీక శాస్త్ర ఉపాధ్యాయుడు బొర్రా శ్రీనివాసరావుకు ఉత్తమ సేవలు అందించినందుకు ప్రభుత్వం అవార్డులు అందజేసింది. ఈ మేరకు మచిలీపట్నంలో గురువారం అవార్డులు ప్రదానం చేశారు. డీఈవో తాహేరా సుల్తానా, ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు, డీవైఈవో పద్మారాణి, ఉపాధ్యాయ సంఘాల నేతలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయులు బొర్రా శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు

వరద తగ్గింది.. కన్నీరు మిగిలింది

పంట పొలాలను వీడని మురుగు

కంకిపాడు/పెనమలూరు: కృష్ణానది ఉగ్రరూపంతో ఏటిపాయ వెంబడి పంట పొలాల్లో వరద నీరు పొంగిపొర్లి ప్రవహించింది. ఏటిపాయను దాటి కరకట్టకు దిగువున సాగులో ఉన్న వేలాది ఎకరాల పంట భూములను ముంచెత్తింది. పెనమలూరు నియోజకవర్గంలోని చాలా ప్రాంతాల్లో వరి, చెరకు, పసుపు, అరటి, తమలపాకు, కంద, మొక్కజొన్న, కూరగాయ తోటలు దెబ్బతిన్నాయి.

అపార పంట నష్టం

రెండు రోజులుగా కృష్ణమ్మ శాంతించింది. ఏటిపాయ గుండా వరదనీరు సముద్రం వైపు సాగుతోంది. కరకట్టకు దిగువున ఉన్న పంట పొలాలు ముంపు నుంచి తేరుకున్నాయి. అయితే పొలాల్లో ఇంకా వరద మురుగు అలానే ఉంది. ఇప్పటికే పంటలు పూర్తిగా కుళ్లిపోతున్న దశకు చేరుకున్నాయి. పంటల సాగుకు ఒక్కో రైతు వరికి ఎకరాకు రూ. 20 వేలు నుంచి రూ. 25 వేలు, ఉద్యాన పంటలకు ఎకరాకు రూ. 1లక్షకు పైగా పెట్టుబడులు వెచ్చించారు. వరద కారణంగా పెట్టుబడులు పూర్తిగా నష్టపోయే పరిస్థితి నెలకొనడంతో అన్నదాతలు కుమిలిపోతున్నారు. పొలాల్లో ఉన్న మురుగు తొలగించేందుకు నానా పాట్లు పడుతున్నారు.

రైతులకు కోలుకోలేని దెబ్బ



వణుకూరులో మునిగిన వరి చేలును చూపుతున్న రైతు

వెంటాడుతున్న తెగుళ్ల బెడద

నీటి ముంపు కారణంగా పంటలపై తెగుళ్ల దాడి మొదలైంది. వరిలో పోషకాల లోపం, ఎండు ఆకు తెగులు, పాము పొడ తెగులు వ్యాప్తి చెందే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. పసుపులో దుంప కుళ్లు, ఇతర పంటల్లో వేరుకుళ్లు వ్యాప్తి చెందే ప్రమాదం ఉంది. అరటిలో కాయ ఊరకుండా చెట్లు పడిపోయేలా ఉన్నాయి. కోతకు సిద్ధంగా ఉన్న తమలపాకు కుళ్లిపోతుంది. వరద ముంపు చేసిన నష్టానికి తోడు తెగుళ్ల వ్యాప్తితో పంట నాణ్యత, పెట్టుబడులు మరింతగా కోల్పోవాల్సి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

నేటి నుంచి ఎన్యూమరేషన్

కాగా పంటల నష్టంపై నేటి నుంచి ఈనెల 10వ తేదీ వరకు ఎన్యూమరేషన్ గ్రామాల్లో చేస్తారు. ఈ నెల 11 నుంచి 16వ తేదీ వరకు పంట నష్టం వివరాలు, రైతుల పేర్లు రైతుసేవా కేంద్రాల్లో(ఆర్బీకే) ప్రకటిస్తారు. అభ్యంతరాలు స్వీకరించి ఈనెల 18న జిల్లా వ్యవసాయాధికారిణికి తుది నివేదిక పంపుతారు. అయితే నష్టపోయిన పంటలకు ఏ మేరకు పరిహారం ఇస్తారనేది ప్రభుత్వం ప్రకటించలేదు.

ఎన్యూమరేషన్‌కు ప్రభుత్వం ఆదేశం

కాగా పంటల నష్టంపై సర్వే చేసి నివేదిక సిద్ధం చేయడానికి ప్రభుత్వం ఎన్యూమరేషన్‌కు ఆదేశాలు ఇచ్చింది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం అయితే 33 శాతం పైగా పంట నష్టం జరిగి ఉండాలని, ఈ-క్రాప్ తప్పక నమోదు చేసుకొని ఉండాలి. గరిష్టంగా 5 ఎకరాలకు మాత్రమే పంట నష్టం ఇస్తామని ప్రకటించింది. పంట నష్టం ఎంతమేరకు జరిగిందని అంచనా ఎలా వేస్తారనేది ప్రశ్నగా ఉంది. అధికారులు, సిబ్బంది సర్వేపైనే రైతుల భవిష్యత్తు ఉంది. పైగా పలువురు రైతులు ఈ-క్రాప్ చేయించుకోలేదు. ఈ క్రాప్ ప్రక్రియ జరుగుతుండగానే వరదలు వచ్చాయని రైతులు చెబుతున్నారు. పంటలు నష్టపోయి ఇబ్బందుల్లో ఉంటే ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చే విషయంలో కఠినమైన నిబంధనలు విధించడం భావ్యం కాదని రైతులు తెలుపుతున్నారు.

ఏ ఒక్క పంట పనికొచ్చేలా లేదు



గత ప్రభుత్వం ఒక్కో పసుపు రైతుకు ఎకరాకు రూ. 75 వేలు పరిహారం ఇచ్చింది. అప్పుడు విత్తనం ఖర్చు రూ. 30 వేలు. ఇవాళ రూ. 60 వేలు. పెట్టుబడి లక్ష దాటిపోయింది. పసుపు, కంద, మొక్కజొన్న ఏ ఒక్కటీ పనికొచ్చేలా లేదు. అన్నీ కుళ్లిపోతున్నాయి. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆదుకోవాలి.

– యనమదల వెంకటేశ్వరరావు, రైతు, మద్దూరు.

రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి




వరదల కారణంగా పంటలు పూర్తిగా పోయాయి. దిక్కుతోచని స్థితిలో ఉన్నాం. అప్పు చేసి పంటలు సాగు చేస్తున్నాం. పంట నష్టపరిహారం పూర్తిగా ఇచ్చి రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి. రైతులకు వెంటనే న్యాయం చేయాలి.

– కె. వీరకుమార్, రైతు, పెదపులిపాక.

ఎలక్ట్రిక్ కారు దగ్ధం

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం గూడవల్లి జాతీయ రహదారి పక్కనున్న కార్ల షోరూంలో గురువారం కస్టమర్‌కు చెందిన ఓ ఎలక్ట్రిక్ కారు దగ్ధమైంది. నగరంలోని ఓ కస్టమర్‌కు చెందిన కారు రెండు రోజులు వరద నీటిలో తడవడంతో షోరూమ్‌కు తీసుకొచ్చారు. కారును షోరూమ్ పరిసరాల్లో పార్కింగ్ చేయగా మధ్యాహ్నం దాటిన తర్వాత బ్యాటరీలో సాంకేతిక సమస్యలు ఏర్పడి మంటలు చెలరేగాయి. ఇవి వ్యాపించడంతో కారు మొత్తం దగ్ధమైంది. నివాసాల మధ్య ఫైర్‌సేఫ్టీ లేకుండా షోరూమ్ ఎలా ఏర్పాటు చేశారంటూ ఈ ప్రాంతవాసులు ఆందోళన వ్యక్తం చేశారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పివేశారు.

పంట నష్టంపై సర్వే చేయాలి



పెనమలూరు: మండల పరిధిలో పంట నష్టంపై సర్వే చేయాలని తహసీల్దార్ గోపాలకృష్ణ సూచించారు. పెనమలూరు తహసీల్దార్ కార్యాలయంలో గురువారం వ్యవసాయ, రెవెన్యూ, ఉద్యానవన శాఖ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ఈనెల 10వ తేదీలోపు గ్రామ స్థాయిలో పంట నష్టంపై సర్వే చేయాలని ఆదేశించిందన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా సర్వే చేయాలని సూచించారు. మండల వ్యవసాయాధికారిణి కనకమేడల శైలజ మాట్లాడుతూ రైతులకు అన్యాయం జరగకుండా సర్వే చేయాలని అన్నారు. సమావేశంలో డీటీ శ్రీనివాసరావు, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.